www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 22 అక్టోబర్ 2024

5

పశ్చిమ గోదావరి



29వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 29వ వార్డు అరుంధతీపేటలో పలు వీధుల్లో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సోమవారం పర్యటించారు. పారిశుధ్య సమస్యల పరిష్కార చర్యల్లో భాగంగా 14వ సచివాలయ అరుంధతీపేట పరిధిలో ఆకస్మికంగా పర్యటించారు. స్థానికంగా ఉన్న రోడ్లు, మురుగు కాలువల సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు..

సర్వం సిద్ధం

నేటి నుంచి ఏలూరు జిల్లాలో, రెండు రోజుల్లో 'పశ్చిమ'లోనూ కొనుగోళ్లు ప్రారంభం

'పశ్చిమ'లో 4.10 లక్షలు, ఏలూరు జిల్లాలో 5.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

రెండు జిల్లాల్లో 590 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

సరిపడా సంచులు సిద్ధంగా ఉన్నట్లు అధికారుల ప్రకటన

ఇ-క్రాప్‌లో నమోదు కాని కౌలురైతుల పరిస్థితి ఏమిటీ?

భారీ వర్షాల హెచ్చరికలతో రైతుల్లో తీవ్ర ఆందోళన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు మంగళవారం నుంచి ఏలూరు జిల్లాలో ప్రారంభం కానున్నాయి. వర్షాల నేపథ్యంలో రెండు రోజుల వ్యవధిలో పశ్చిమగోదావరి జిల్లాలోనూ ధాన్యం కొనుగోలుకు అక్కడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు ఇప్పటికే అధికారులు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానుండటంతో ప్రక్రియ ఏవిధంగా సాగుతుందోననే ఉత్కంఠ రైతుల్లో నెలకొంది. వైసిపి ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ఇకనుంచైనా తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుకుంటున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పంట చివరి దశకు చేరింది. మెట్ట ప్రాంతం తాడేపల్లిగూడెం, ఉంగుటూరు వంటి నియోజకవర్గాల్లో పంటపొలాలు మాసూళ్లకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ధాన్యం కొనుగోలుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లనూ అధికారులు పూర్తి చేశారు. ఏలూరు జిల్లాలో 5.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి, 'పశ్చిమ'లో 4.10 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. అందుకు తగిన విధంగా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లాలో 250, పశ్చిమలో 340 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సంచులు సైతం తగినన్ని అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్న పరిస్థితి ఉంది. కొనుగోళ్లు ప్రారంభమయ్యాక పరిస్థితి ఎలా ఉంటుందో వేచిచూడాలి.

ఇ-క్రాప్‌లో నమోదు కాని కౌలురైతుల పరిస్థితి ఏమిటి?

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లు అంతా ఇ-క్రాప్ నమోదు ఆధారంగానే సాగింది. కౌలురైతుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదు చేసేవారు కాదు. దీంతో భూయజమాని పేరుపైనే కౌలురైతులు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇది కౌలురైతులకు పెనుశాపంగా మారింది. భూయజమాని ఖాతాలోనే ధాన్యం సొమ్ములు జమయ్యేవి. ఈ సొమ్ము ఇవ్వడానికి యజమానులు కౌతురైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవారు. ఇక రవాణా ఛార్జీలు జమైనా కౌలురైతులకు ఇచ్చేవారు కాదు. గట్టిగా మాట్లాడితే పొలం కౌలుకు ఇవ్వబోమని బెదిరింపులకు దిగేవారు. దీంతో కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కౌలుచట్టంలో మార్పులు చేయకపోవడంతో ప్రస్తుత ఖరీఫ్‌లోనూ ఇ-క్రాప్‌లో కౌలురైతుల పేర్లు చాలావరకూ నమోదు కాలేదని తెలుస్తోంది. ఇ-క్రాప్‌లో నమోదుకాని కౌలురైతులు ధాన్యం తమ పేరును అమ్ముకోవాలా.. లేక భూయజమాని పేరున విక్రయించాలా అనే దానిపై రైతుల్లో చర్చ సాగుతోంది. సాగు చేసిన కౌలురైతుల్లో 50 శాతానికిపైగా రైతుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదు కాలేదని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో మాదిరిగానే కౌలురైతుల పరిస్థితి ఉంటే మార్పు ఏం జరిగినట్టు అని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. కొనుగోళ్లు ప్రారంభమయ్యాక మరిన్ని సమస్యలు బయటపడే అవకాశం ఉంటుందని చెప్పొచ్చు.

భారీ వర్షాల హెచ్చరికలతో ఆందోళన..

ఈ నెల 24, 25, 26 తేదీల్లో జిల్లాకు భారీ వర్షాల ముప్పు ఉన్నట్లు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటి నుంచే అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దీంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పంట చివరి దశకు చేరిన తరుణంలో భారీ వర్షాలు కురిస్తే పంట దెబ్బతినే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికే ఖరీఫ్‌లో విరుచుకుపడిన ప్రకృతి వైపరీత్యాలకు రెండుసార్లు రైతులు పంటను నష్టపోయారు. ఉన్న పంట కూడా చేతికి అందకపోతే అన్నదాత తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. ఈ గండం ఏవిధంగా గట్టెక్కాలా అని రైతులు తలలు పట్టుకుంటున్నారు.



అమరవీరుల స్తూపం వద్ద ప్రముఖులు

పోలీసులు చిరస్మరణీయులు

జిల్లా కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి



నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులు చిరస్మరణీయులని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎఎస్‌పి వి.భీమారావు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పోలీస్ అమరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడుతూ అమరవీరులైన పోలీసులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని, మాతృభూమి శ్రేయస్సు కోసం పని చేసిన నిస్వార్థ శ్రామికులు పోలీసులు అని అన్నారు. మన దేశ రక్షణకు సరిహద్దుల్లో అహర్నిశలు విధి నిర్వహణలో ఉండే జవాన్ల కారణంగా మనం భరోసాగా జీవనం సాగిస్తున్నామని, అదే విధంగా మన సమాజ రక్షణకు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఉండటం వల్ల ధైర్యంగా ఉంటున్నామన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, మతతత్వం, ఫ్యాక్షనిజం వంటి విచ్ఛిన్నకర శక్తులతో, నేరాలకు పాల్పడే అసాంఘిక శక్తులతో పోరాడుతూ సమ సమాజ నిర్మాణానికి పోలీసులు కంకణబద్ధులై విధులను నిర్వహిస్తున్నారన్నారు. కీర్తిశేషులైన ఐపిఎస్ అధికారులు కెఎస్.వ్యాస్, పరదేశినాయుడు, ఉమేష్‌చంద్ర వంటి అనేక మంది పోలీస్ అధికారులు, సిబ్బంది సంఘవిద్రోహశక్తుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగనిరతి స్ఫూర్తిదాయకమని, పోలీస్ సిబ్బంది ప్రతిఒక్కరూ వారి నుండి స్ఫూర్తిని పొందాలని అన్నారు. పోలీసుల అమరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, వారందరికీ అండగా ఉంటామని తెలియజేస్తున్నానన్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ తాము విధి నిర్వహణే పరమావధిగా భావిస్తామన్నారు. ప్రజల కోసం నిరంతరం పని చేసే పోలీసు సేవలు అభినందనీయమన్నారు. జిల్లా పోలీసులు ప్రకృతి వైపరీత్యాలు, ఉత్సవాలు, కోవిడ్ కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత వంటి సేవలు మరువలేనివని చెప్పారు. ఈ సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. జిల్లా పోలీసు శాఖ బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతున్నామని ఎస్‌పి తెలిపారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ దేశం కోసం, రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పోలీసులు చిరస్మరణీయులు అన్నారు. సౌకర్యాల లేమితో సేవ చేస్తున్నారని ఎంతగానో గుర్తించిన జలగం వెంగళరావు వీరికి జీతభత్యాలను పెంచారన్నారు. సమాజం పట్ల పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజల్లో అభిమానం, గౌరవం పొందేలా ప్రతి పోలీసూ విధులు నిర్వహించాలన్నారు. పోలీసులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. తొలుత జిల్లా పోలీసు శాఖ రూపొందించిన అమరవీరుల గ్రంథంలో దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన అమర వీరుల పేర్లను (రోల్ ఆఫ్ హానర్) జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ అద్నాన్ నయీంఅస్మికి అందజేశారు. అదనపు ఎస్‌పి వి.భీమారావు దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన రోల్ ఆఫ్ హానర్ లోని పేర్లను చదివి వినిపించారు. జిల్లాలో విధినిర్వహణలో అమరులైన నలుగురు పోలీసులు ఎ.నాగేశ్వరరావు, డి.పీటర్, డిహెచ్‌విజి.శ్రీనివాస్, ఎస్‌విఎస్‌ఎన్.ఆచార్యులను గుర్తు చేసుకున్నారు. వారి త్యాగాలకు గుర్తుగా వారి కుటుంబాలకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి నాదెళ్ల బాలాజీ మారుతి మురళీకృష్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్‌ఎస్.కుమారేశ్వరన్, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డిఎస్‌పి ఎం.సత్యనారాయణ, భీమవరం డిఎస్‌పి రావూరి గణేష్ జయసూర్య, తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్, భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, పోలీసు అధికారులు, పోలీసులు, విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు కుటుంబాలు, ప్రజలు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల భారం వేయొద్దు

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన



వీరవాసరంలో..

ప్రజాశక్తి - వీరవాసరం

సర్దుబాటు పేరిట విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రతిపాదనను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదన విరమించుకోవాలని, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల నిర్ణయం విరమించుకోవాలని, విద్యుత్ సంస్కరణలు ఆపాలని, కార్పొరేట్లకు వరాలు.. ప్రజలపై భారాలా' అంటూ స్థానిక విద్యుత్ ఎఇ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా పెంచబోమని నాడు చెప్పారని గుర్తు చేశారు. నాటి హామీకి భిన్నంగా విద్యుత్ సంస్థల ప్రతిపాదనలను అంగీకరించడాన్ని తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి విద్యుత్ ఛార్జీలు పెంచితే మరో విద్యుత్ పోరాటం తప్పదని నరసింహమూర్తి హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి విధానాల ఫలితంగా నిత్యావసరాలు చుక్కలనంటుతున్నాయని, ఈ దశలో కూటమి ప్రభుత్వం భారాలు మోపడం అత్యంత దారుణమని విమర్శించారు. అనంతరం ఎఇ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతుల మృత్యుంజయరెడ్డి, రాము, అయినపూడి బాబూరావు, పాలా కోటేశ్వరరావు, లింగం సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్, తాళ్లూరు రాము, కొత్తల సత్తిబాబు, తోట నరసింహారావు, కిలాడి సత్యనారాయణ, గోడి దావీదు, బత్తుల విజయకుమార్ పాల్గొన్నారు.

ఉండి: ట్రూఅప్ ఛార్జీలను వెంటనే రద్దు చేసి అదనపు విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మెయిన్ సెంటర్లో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రూఅప్ ఛార్జీలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. గతంలో వాడిన విద్యుత్‌కు నేడు అదనపు సొమ్ము చెల్లించాలని బిల్లులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణం ఈ భారాలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొట్టాడ వెంకటేశ్వరరావు, నాయకులు కింతాడ రమేష్, మోపిదేవి రాము, నక్కా బాలకోటేశ్వరరావు, ఆళ్ల గొల్లబ్బాయి, రత్నం తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో ధర్నా చేస్తున్న నేతలు

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

అర్జీదారులు విన్నవించే సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి నాణ్యమైన పరిష్కారాన్ని వేగవంతంగా అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 179 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్‌ఎల్‌ఎ, రీఓపెనింగ్ లేకుండా చూడాలన్నారు. వేరే కార్యాలయానికి సంబంధించిన ఫిర్యాదు అందితే కాలయాపన లేకుండా వెంటనే సంబంధిత కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. వివిధ శాఖలు సర్వీస్ డెలివరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి దోసిరెడ్డి, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

పిఎం సురక్ష జీవనజ్యోతి బీమా యోజన వినియోగించుకోవాలి

పిఎం సురక్ష బీమా యోజన, పిఎం జీవన జ్యోతి బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె జిల్లాలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 15 నుండి జనవరి 15 వరకు మూడు నెలలపాటు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్.వేణుగోపాల్, డ్వామా పీడీ డాక్టర్ ఎసిహెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌కెఆర్ ప్రొఫెసర్‌కు అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ చిగురుపాటి రవి స్వరూప్‌కు తమిళనాడులోని చిదంబరంలోని అన్నామలై యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నుండి పిహెచ్‌డి పట్టా లభించిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా యాజమాన్యం తరపున కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్‌వర్మ డాక్టర్ రవి స్వరూప్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిస్వరూప్ మాట్లాడుతూ 'హైబ్రీడ్ ఆప్టిమైజ్డ్ న్యూరల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి ఇన్నోవేటివ్ అడ్వర్సేరియల్ నెట్‌వర్క్ అవుట్‌లియర్ ప్రిడిక్షన్, సీక్వెన్షియల్ డేటా అనాలిసిస్ రూపకల్పన, అభివృద్ధి' అనే థీసిస్‌పై డాక్టర్ కె.రాజా పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకు అన్నామలై యూనివర్సిటీ పిహెచ్‌డిని ప్రదానం చేసిందన్నారు. డాక్టర్ రవి స్వరూప్ మాట్లాడుతూ తన పిహెచ్‌డి థీసిస్‌లో అవుట్‌లియర్ ప్రిడిక్షన్, సీక్వెన్షియల్ డేటా అనాలిసిస్‌ను మెరుగుపరిచే వినూత్న ప్రత్యర్థి నెట్‌వర్క్ రూపకల్పన హైబ్రీడ్-ఆప్టిమైజ్ చేయబడిన న్యూరల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించడం ద్వారా, వివిధ డొమైన్‌ల్లో డేటా ఆధారిత నిర్ణయాల కచ్చితత్వం, విశ్వసనీయతను గణనీయంగా మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమర్థవంతమైన సిస్టమ్‌ల కోసం విశ్లేషించడానికి కొన్ని ప్రోటో-టైప్ మెషిన్ లెర్నింగ్ మోడళ్లను ఉపయోగించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి.చంద్రశేఖర్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎస్.రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని క్లాప్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ క్లాప్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక లేబర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం లేబర్ ఆఫీసర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లతో గత ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకోవడం బాధాకరమన్నారు. కేవలం నెలకు రూ.12,500 జీతం ఇస్తే పెరిగిన ధరలతో ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ఈ వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం జరుగుతుందన్నారు. 11 నెలలుగా పిఎఫ్ సొమ్ము జమచేయడం లేదన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించమంటే ఉద్యోగాలు తీసేస్తామని చెప్పడం అన్యాయమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎంటివివి గణేష్, ఉపాధ్యక్షులు ఎం.తాతారావు, సాయి, వరప్రసాద్, ఆదినారాయణ, వెంకటరావు, మల్లికార్జున, చిన్నా, కేశవరావు, సురేంద్ర పాల్గొన్నారు.



లేబర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

24, 25 తేదీల్లో భారీ వర్షాలు

మండలాలవారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

రైతులను అప్రమత్తం చేయాలి

కలెక్టర్ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

తుపాను హెచ్చరిక నేపథ్యంలో మండలాలవారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించి సిద్ధంగా ఉండాలని, రైతులను అప్రమత్తం చేయాలని కలెక్టర్ డాక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వీటిని ఎదుర్కొనేందుకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధాన్యం తడవకుండా భద్రపర్చుకునేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలను రైతులకు వ్యవసాయ అధికారులు తెలియజేయాలని కోరారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకూడదని స్పష్టం చేశారు. ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో మండల అధికారులంతా ఒక బృందంగా ఏర్పడి పరస్పరం సమన్వయంతో, సహకారంతో పనిచేసి తుపాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని చెప్పారు. మండలస్థాయి అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను ముందే గుర్తించి, అవసరమైతే ప్రజలను తరలించాలని సూచించారు. అన్ని వసతులతో పునరావాస శిబిరాలను సిద్ధం చేయాలని, అవసరమైన ఆహార పదార్థాలను, మందులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వంతెనలు, కాజ్‌వేల వద్ద కాపలా ఉంచాలని చెప్పారు. ఆర్‌డిఒలు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించడంతోపాటు, ఎప్పటికప్పుడు పరిస్థితిని జిల్లా కేంద్రానికి తెలియజేయాలని ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండలస్థాయిల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలన్నారు. చెరువుగట్లను బలోపేతం చేయాలని సూచించారు

స్థలం మా ఆధీనంలోనే ఉంది

ఏలూరు పార్థన సమాజం ఉపాధ్యక్షులు చల్లా కేశవచంద్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు ఆర్‌ఆర్‌పేట ఈదరవారి వీధిలోని ఏలూరు ప్రార్థన సమాజం తమ ఆధీనంలోనే ఉందని, ఎటువంటి ఆక్రమణలకు గురికాలేదని ఆ ప్రార్థన సమాజం ఉపాధ్యక్షులు చల్లా కేశవచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ సోమవారం ఏలూరులో 'భూ'చోళ్లు శీర్షికన 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించి ప్రకటన విడుదల చేశారు. ప్రార్థన సమాజం భూమి ఆక్రమణకు గురికాలేదని, ఈ వార్తను తాము ఖండిస్తున్నామని పేర్కొన్నారు. స్థలం పూర్తిగా సమాజం అధీనంలోనే ఉందని తెలిపారు. ఇటీవల కొద్దికాలంగా అనివార్య పరిస్థితుల వల్ల సమాజం ఆధ్వర్యాన కార్యకలాపాలు ఏవీ జరగడం లేదని పేర్కొన్నారు. కార్యకలాపాలు మళ్లీ పునరుద్ధరించాలనే సంకల్పంతో కొత్త కమిటీని సొసైటీగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం సమాజం ఆవరణలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ దీనిపై సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దీనికి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. ఈ మధ్య కురిసిన వర్షాల వల్ల ప్రార్థన సమాజం ఆవరణ అంతా మొక్కలు, తుప్పలతో నిండిపోయిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడి సమావేశం నిర్వహణ కష్టతరం కాబట్టి సమాజ ఆవరణలో ఉన్న మొక్కలు, తుప్పలను జెసిబితో తొలగించే పనిని అక్కడి కాపలాదారులతో తామే శుభ్రం చేయించామని తెలిపారు. దీనిలో ఇతరుల ప్రమేయం ఏమీ లేదని పేర్కొన్నారు.

డంపింగ్ యార్డుగా కొండయ్య చెరువు

నగర పంచాయతీ తీర్మానం: డీసెంట్ ఇచ్చిన ఏడుగురు కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఆకివీడు

కొండయ్య చెరువును డంపింగ్ యార్డుగా మార్చాలని నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం తీర్మానించింది. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ ఏడుగురు కౌన్సిలర్లు డీసెంట్ ఇవ్వడం విశేషం. ఈ ఒక్క అంశమే ఎజెండాగా ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన సోమవారం నగర పంచాయతీ పాలకవర్గ అత్యవసర సమావేశం జరిగింది. నగర పంచాయతీ పరిణామం రోజురోజుకీ పెరిగిపోతుందని, ఈ పరిస్థితుల్లో ఖాళీగా ఉన్న చెరువులు, గుంటలను తాగునీటి చెరువులుగా మార్చాల్సిన పరిస్థితి ఉందని పలువురు కౌన్సిలర్లు అన్నారు. కొండయ్య చెరువును పూర్తిస్థాయిలో తవ్వి తాగునీటి చెరువుగా మార్చేందుకు గతంలో గ్రామ పంచాయతీలో తీర్మానం సైతం ఆమోదించారని గుర్తు చేశారు. అయితే సమావేశానికి మొత్తం 19 మంది సభ్యులు హాజరవ్వగా ఈ ప్రతిపాదనను ఏడుగురు సభ్యులు వ్యతిరేకించారు. మిగిలిన 12 మంది అంగీకారంతో మెజార్టీ మేరకు తీర్మానం ఆమోదించినట్లు ప్రకటించారు. దీనిపై వైసిపి సభ్యులు పుప్పాల సత్యనారాయణ, నిమ్మల నాగేశ్వరరావు, ఆత్ర మున్నీసా, మోటుపల్లి కుమారి, తిమ్మారెడ్డి మాధవి డీసెంట్ ఇవ్వగా, ఇదే అంశంపై జనసేనకు చెందిన గుర్రాన నాగలక్ష్మి, గోపిశెట్టి సత్యవతి వేరేగా మరో డీసెంట్ అందజేశారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం జల్లికొమ్మరలో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 123, పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ధర్మరాజు మాట్లాడుతూ పశువుల రక్షణ కోసం ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు సోకిన రోగాలకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో స్కానింగ్ మిషన్ ద్వారా పాడి పశువు కడుపులో పిండాన్ని ధర్మరాజు స్వయంగా పరీక్షించి చూశారు. రైతులు రైతు సేవా కేంద్రాలు ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పశువర్ధక అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పశువర్ధక శాఖ నుండి రైతులకు అందుతున్న సేవలు వివరించారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాల ఏర్పాటు

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ వార్డు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. పట్టణంలోని 22 నుంచి 25 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకూ టైలర్‌పేట, కోటవద్ద పాలెం, మునిషిఫ్‌గారివీధి, చినమామిడి పల్లి నాలుగు సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తమ ఆధార్ కార్డుల్లోని తప్పులను సరిచేసుకోవాలన్నారు. పట్టణ పరిధిలోని అన్ని కాలేజీలు, పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులందరితో ఆధార్ కార్డులు నమోదు చేయించుకునేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.

ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జివిఎస్ రామకృష్ణంరాజు తెలిపారు. మండలంలోని 22, 23 తేదీల్లో రుస్తుంబాద, లక్ష్మణేశ్వరం-1, తూర్పుతాళ్లు 1, ఎల్‌బి.చర్ల, చిట్టవరం, సరిపల్లి సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24, 25 తేదీల్లో లక్ష్మీశ్వరం - 2, పసలదీవి, లిఖితపూడి గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఆధార్ కార్డుల్లో తప్పులను సరిచేసుకునేందుకు ఈ క్యాంపులను వినియోగించుకోవాలన్నారు.

టిడిపిలో వైసిపి నేతల చేరిక

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు, నరసింహపురం గ్రామ ఉపసర్పంచి ఇందుకూరి ఆంజనేయరాజు, పట్టణంలోని 1 వార్డు నుండి కడలి సుబ్రహ్మణ్యం (బాలు) వారి అనుచరులు 150 మందితో సోమవారం టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎపిఐసిసి ఛైర్మన్ మంతెన రామరాజు వారికి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన మంచి పనులకు ఆకర్షితులైన వైసిపి నాయకులు టిడిపిలో చేరడం ఆనందదాయకమన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, భీమవరం మండల అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న, కె.పృథ్వీశంకర్, వీరవాసరం మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

కీర్తి కిరీటం నేతాజీ

ప్రజాశక్తి - పాలకొల్లు

స్వాతంత్రం కోసం పోరాడిన కీర్తి కిరీటం, మరణం లేని అమరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని జివిఎస్‌విఆర్‌ఎం హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. ఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో అని చెప్పారు. స్థానిక జివిఎస్‌వి ఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ అక్టోబర్ 21 1943లో స్థాపించబడిన గవర్నమెంట్ ఆఫ్ ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపన దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం భవానీప్రసాద్ మాట్లాడారు. భారతదేశపు తొలి కమాండర్ ఇన్ చీఫ్ నేతాజీ అన్నారు. వర్ధంతి లేని జయంతి జరుపుకునే ఒకే ఒక్క స్వాతంత్ర సమరయోధుడు అని తెలిపారు. స్వాతంత్రం కోసం వీర మార్గంలో పోరాడదామని యువకులను ఉత్సహించితా అభిప్రాయంతోనే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అనే రాజకీయ పార్టీని స్థాపించి బ్రిటీష్ వారితో యుద్ధం చేశారని తెలిపారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బి.త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సత్వరం స్పందించాలి

తాడేపల్లిగూడెం : ప్రజా సమస్యలను అన్ని శాఖల అధికారులు సత్వరం పరిష్కరించాలని తహశీల్దార్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మండలం నుంచి ఐదు సమస్యలపై అర్జీలు అందినట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ వి.హనుమ, అగ్రికల్చర్ ఆఫీసర్ ఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

లలితాదేవి సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం బిజిబిఎస్ మహిళా కళాశాలకు ఎర్రమిల్లి లలితాదేవి సేవలు ఎనలేనివని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ నూలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాలేజీలో జరిగిన లలితాదేవి సంతాప సభలో ఆయన ప్రసంగించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లలితాదేవి ప్రిన్సిపల్‌గా పనిచేసిన హయాంలో అనేక కొత్త కోర్సులు రప్పించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారన్నారు. ఆమె కాలేజీ అభివృద్ధికి ఎనలేని సేవ చేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ డాక్టర్ మధు షాలిని, మాజీ ప్రిన్సిపల్ కె.అమ్మాజీ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్ట్

భీమవరం టౌన్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న మహిళను సోమవారం భీమవరం రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి ఆమె నుంచి 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిఆర్‌పి స్టేషన్ ఎస్ఐ బిటివి.రమణ తెలిపారు. రాజమండ్రి లక్ష్మీవారపుపేటకు చెందిన జెర్రిపోతుల రమణమ్మ రెండు బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లు తరలిస్తూ జంక్షన్ రైల్వేస్టేషన్‌లో తిరుగుతూ ఉండగా అనుమానం వచ్చి తనిఖీ చేసినట్లు వివరించారు. తనిఖీలు బ్యాగ్‌లో ఉన్న 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి విలువ రూ.లక్షా పదివేలు ఉంటుందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి రమణమ్మను మంగళవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

ప్లాస్టిక్ కనికల పరిశ్రమకు అనుమతులు రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద ఆకివీడువాసుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ప్లాస్టిక్ కనికల తయారీ పరిశ్రమకు నిబంధనలకు విరుద్ధంగా ఫ్యాక్టరీస్, కార్మిక శాఖలు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఆకివీడు వాసులు స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం స్థానిక కలెక్టరేట్లో జరిగిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆకివీడు వాసి బైరి ఆంజనేయులు మాట్లాడారు. నాలుగు నెలలుగా కాలుష్య ప్లాస్టిక్ పరిశ్రమ మాకొద్దంటూ ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యాక్టరీస్, లేబర్ డిపార్టుమెంట్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపకుండా ఫ్యాక్టరీ యజమాని ఇచ్చిన తప్పుడు సమాచారం మేరకు అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారన్నారు. కార్యక్రమంలో ఓగిరాల ఏలియా, బి.శివ, జ్ఞానప్రకాష్, కె.సతీష్, కల్యాణి పాల్గొన్నారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు పెంపు

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్‌సి, ఎస్‌టి, విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత డిఎస్‌సి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి తెలిపారు. ఈ నెల ఈ నెల 25వ తేదీ దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, కోచింగ్ ఎంపిక కోసం ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

వీధిలైట్ల సమస్య పరిష్కరించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర


వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పొలమూరులో వీధి దీపాల సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం స్థానిక పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు చింతపల్లి తిరుమలరావు, పంపన సూర్యనారాయణ, కేతా పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు

గణపవరంలో విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - గణపవరం

అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం గణపవరంలో పోలీస్ సిబ్బంది డిగ్రీ కాలేజీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎ.మణికుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ ర్యాలీ కాలేజీ నుంచి స్థానిక పోలీస్ ఐలాండ్ వరకూ సాగింది. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుందరయ్య భవనంలో నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 22వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం, వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జి ఆసుపత్రి వారు సంయుక్తంగా చిన్న పిల్లల ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం తెలిపారు. 15 సంవత్సరాల్లోపు పిల్లలకు అలసట, ఆయాసం, బరువు పెరగకపోవడం వంటి అనారోగ్య సమస్యలుంటే వెంటనే ఈ మెడికల్ క్యాంపునకు తీసుకొచ్చి 2డి ఎకో టెస్టు చేయించుకుని సమస్యలను గుర్తించుకోవాలని తెలిపారు. గుండె జబ్బులు గుర్తించిన చిన్నపిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లుగా తెలిపారు. ఇప్పటి వరకూ 50 నుంచి 60 మంది చిన్నపిల్లలు ఈ క్యాంపు ద్వారా ఆపరేషన్లు చేయించుకుని గుండె సమస్యలను మెరుగుపర్చుకున్నట్లు వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ప్రసాదరాజు తెలిపారు. మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద ఎంబిబిఎస్ డాక్టరుచే ఉచిత రెగ్యులర్ వైద్యసహాయ కేంద్రం, డయాగ్నస్టిక్ సెంటర్, డాక్టరు రిఫరెన్సు మేరకు ఉచితంగా ఇసిజి, అత్యంత తక్కువ ధరల్లో మందులు ఇచ్చేందుకు జనరిక్ మెడికల్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాన్ని అందరూ వినియోగించుకోవాలని బలరాం సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

శ్రీరాంపేటలో అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా పట్టణంలోని 3వ వార్డు శ్రీరాంపేట కోదండ రామాలయం వద్ద సోమవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కర్నేన గౌరునాయుడు, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ రోజారమణి దంపతులు ప్రారంభించారు. 3వ వార్డు మాజీ కౌన్సిలర్ బేరం శ్రీరామచంద్రమూర్తి, కేశవరపు సత్యనారాయణ, మండెల భాస్కర్‌రావు, రజినీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'దేవాలయ భూమి ఆక్రమణకు యత్నం'

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని రుస్తుంబాద శివాలయానికి చెందిన భూమిని సోమవారం ఇద్దరు వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో రెండు గంటల పాటు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీనికి సంబంధించి హిందూ ధార్మిక సంఘం నాయకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన రామకృష్ణ, నానాజీ రెండు రోజుల క్రితం దేవస్థానం భూమిలో కంటేనర్ ఏర్పాటు చేశారు. అందులో చిన్న దుకాణంతో పాటు, ఒక ప్రార్థనా మందిరాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని పూజారీ ఆలయ అధికారులకు తెలియజేశారు. అయితే ఇఒ సెలవులో ఉం డటంతో ఎవరూ అక్కడికి రాలేదు. ఈ క్రమంలో ఆక్రమణకు పాల్పడిన ఇద్దరు పనులు చేపడుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న విహెచ్‌పి నాయకులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. దేవాలయ భూమిని రక్షించాలంటూ నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయాన్ని తెలుసుకున్న సిఐ యాదగిరి, ఎస్సై ముత్యాలరావులు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఇటు దేవాదాయ శాఖ అధికారులు క్రేన్‌ను తీసుకొచ్చి ఆలయ స్థలంలో ఏర్పాటు చేసి కంటేనర్‌ను బయటకు తొలగించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. ఈ ఆందోళనలో విహెచ్‌పి నాయకులు నాగేంద్ర అఖిల్, కిషోర్ పాల్గొన్నారు.

సహకార సంఘాల రైతులకు ఉత్తమ సేవలందించాలి

ప్రజాశక్తి - ఉండి


మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సన్న, చిన్నకారు రైతుల ప్రయోజనాలను కాపాడేలా ఉత్తమ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో పిఎసిఎస్‌లు (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు) ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై (ఎరువుల వ్యాపారంపై) అందిస్తున్న సర్టిఫికెట్ కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సొసైటీలు నిరంతరం మేలైన సేవలను రైతులకు అందించాలన్నారు. రైతుల సంక్షేమం కోసం పిసిఎస్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగపడే సర్వీసులను సొసైటీల ద్వారా అందించాలని సూచించారు. సిసిఆర్‌సి కార్డ్స్ పొందిన కౌలు రైతులకు సొసైటీల ద్వారా విరివిగా రుణాలు అందజేయాలని సూచించారు. సొసైటీలు ఆర్థిక పరిపుష్టికి వివిధ రంగాల్లో ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 122 సహకార సంఘాలు ఉన్నాయని, రైతులకు రుణ, రుణేతర కార్యకలాపాల ద్వారా స్థిరమైన సహాయాన్ని అందిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి గణనీయంగా దోహదపడుతున్నాయన్నారు. ఇప్పటికే పిఎసిఎస్‌లు కంప్యూటరీకరణకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార శాఖ ద్వారా రైతులకు అధిక -నాణ్యత గల ఎరువులు, పురుగుమందుల విక్రయాలను నిర్ధారించడానికి అన్ని సొసైటీలు వ్యవసాయ లైసెన్స్‌ను పొందాలని తప్పనిసరి చేసిందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో లైసెన్స్‌లు అవసరమైన 76 పరపతి సంఘాలకు సంబంధించిన ప్రతినిధులకు రాష్ట్రవ్యాప్తంగా కషి విజ్ఞాన కేంద్రాల సహకారంతో 15 రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సిసిఐఎన్‌ఎం సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. 30 మంది పిఎసిఎస్ ప్రతినిధులకు ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో, 20 మందికి వెంకటరామన్న గూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో, నలుగురికి ఎన్‌టిఆర్ జిల్లా గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రంలో, ఆరుగురికి నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రంలో, 16 మందికి గుంటూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, ఉండి కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి కె.వెంకటేశ్వరరావు, ఎస్‌డిఎల్‌సిఒ జి.సత్యనారాయణ, భీమవరం ఎడిఎ సి.హెచ్.శ్రీనివాస్, కోపరేటివ్, కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖల సిబ్బంది, శిక్షణ పొందే పిఎసిఎస్‌ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విమలాకర్ ఎంపిక

ప్రజాశక్తి - తణుకు

శ్రీచిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) తణుకుకు చెందిన విద్యార్థి టి.విమలాకర్ ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ తమిళనాడులో జరిగే సౌత్ నేషనల్ కబడ్డీ పోటీలకు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నుంచి ఎంపికయ్యారని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.మారుతీదేవి చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా మారుతీదేవి చౌదరి మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ కబడ్డీ పురుషుల పోటీలు మండపేట గవర్నమెంట్ డిగ్రీ కళాశాల వద్ద జరిగాయని, ఆ పోటీల్లో కళాశాల కబడ్డీ టీం నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా సౌత్ నేషనల్ కబడ్డీ పోటీలకు ఎంపికైన టి.విమలాకర్, ఇతర క్రీడాకారులను కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఆలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ

ఉండి: ఆరేడు గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న 200 సంవత్సరాలు పైబడిన తాండవేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి ఆలయాల పున : నిర్మాణ పనులకు ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, జనసేన మండల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు సోమవారం భూమి పూజ చేశారు. ముందుగా వారికి ఆలయ అధికారులు వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు, జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ ఈ దేవాలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆలయానికి సుమారు 45 ఎకరాల మాన్యం ఉందని దాంతో సుమారు 42 లక్షల రూపాయల నగదును దేవాదాయ శాఖకు ఇవ్వగా రూ.కోటీ 50 లక్షలతో నిర్మించనున్నట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కట్రెడ్డి బ్రహ్మానందరావు, మాజీ సర్పంచి పిప్పిరిశెట్టి పోలేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు గొట్టం వెంకటేశ్వరరావు, ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రముఖుడు లక్ష్మీనాయుడు మృతి

పలువురు సంతాపం

ప్రజాశక్తి - పెనుగొండ

సహకార పరపతి సంఘం జిల్లా అధ్యక్షులు, ప్రముఖుడు జవ్వాది లక్ష్మణ్ నాయుడు (57) ఆదివారం మృతి చెందారు. సోమవారం ఆయన భౌతికకాయాన్ని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కొత్తపేట మాజీ ఎంఎల్‌ఎ జగ్గారెడ్డి సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మండల స్థాయి అధికారులతో సోమవారం సమీక్షించారు. రెవెన్యూ, పోలీస్, మండల అభివృద్ధి శాఖ అధికారులతో ఆయన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నాయకర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పైఅధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపిడిఒ జివిఎస్ రామకృష్ణంరాజు, డిప్యూటీ తహశీల్దార్ ఎస్ఎస్-ఎస్.ప్రసాద్, నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వెంకటసురేష్, మొగల్తూరు ఎంపిడిఒ త్రిశూలపాణి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి - పెంటపాడు

గత ప్రభుత్వంలో వైసిపి ప్రజాప్రతినిధులందరూ స్వార్థ ప్రయోజనాలతో డబ్బు సంపాదనే ధ్యేయంగా పని చేశారని, అది గుర్తించిన ఎపి ప్రజలు నిస్వార్థంగా ప్రజాసేవ చేసే కూటమి నాయకులను ఎన్నుకున్నారని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలో వల్లూరుపల్లి గ్రామంలో సోమవారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఈ రోజు చిన్న, సన్న కారు రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఏమైనా చిన్న చిన్న సమస్యలుంటే మరోసారి సర్వే చేయించడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ఉపముఖ్యమంత్రి గ్రామీణ అభివృద్ధి శాఖా మంత్రి పనిచేస్తున్నారన్నారు. ఆయన ఆశయ సాధనకు కేంద్రం నుంచి రాష్ట్రం నుంచి పంచాయతీలకు నేరుగా నిధులు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. స్థానిక నాయకులు ఏ పార్టీ వారైనా తమ సొంత ఊరి అభివృద్ధికి తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి హైమావతి, సర్పంచి దంగేటి రామారావు, జనసేన మండల అధ్యక్షుడు పుల్లాబాబి, దాసరి అప్పన్న, కిలపర్తి వెంకట్రావు, కొవ్వూరి లక్ష్మణ్‌రెడ్డి, కొనకల్ల హరినాథ్, అడబాల నారాయణమూర్తి పాల్గొన్నారు.


మొగల్తూరు : రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ నాయకర్, కొత్తపల్లి

ఉండి : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పాములపర్రులో రూ.పది లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి గ్రామ సర్పంచి కేసన శాంతికుమారి బలుసులరావు, ఎంపిటిసి యడవిల్లి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు తోట శ్రీరాములు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు సహకారంతో గ్రామాభివృద్ధిలో భాగంగా రూ.10 లక్షలతో డ్రెయినేజీలు నిర్మించడంతో గ్రామంలోని పారిశుధ్య సమస్యకు విముక్తి కలుగుతుందన్నారు. దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు అనే నానుడిని నిజం చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పల్లె పండుగను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కేసన యాదగిరి, గ్రామ ఉపసర్పంచి వీర రాఘవులు, నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : రాష్ట్రంలో ప్రతి గ్రామాన్నీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. మండలంలోని పాతపాడు, జగన్నాధపురం, కాళీపట్నం పడమర, కొత్తోట, పేరుపాలెం సౌత్, రామన్నపాలెం గ్రామాల్లో సోమవారం పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నామన్నారు. పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, సర్పంచులు పాల్గొన్నారు.

వాసవీలో ఫ్యాకల్టీ వర్క్‌షాప్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భారత ప్రభుత్వ సంస్థ డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలోని సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు సహకారంతో వాసవీ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో డిజైన్ ఛాలెంజ్స్ ఇన్ ఎఐ బేస్డ్ అంటెన్నాస్ ఫర్ ఫైవ్ జి బియాండ్, విటువి కమ్యూనికేషన్ అప్లికేషన్స్, థియరీ టు ప్రాక్టీస్, మెషీన్ లెర్నింగ్ అప్రోచ్ అనే అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ వర్క్ షాప్‌ను సోమవారం ప్రారంభించారు. నిట్ వరంగల్ సిఎస్ఇ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కెవి.కాదంబరి ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఐఅండ్ఎంఎల్ అప్లికేషన్స్ రిలేటెడ్ టు అంటెన్నస్ అనే అంశంపై డెలివరీ ఇచ్చారు. ఎపి నిట్ ఎలక్ట్రానిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్.యువరాజ్ ఒఎఎం అంటెన్నస్ ఫర్‌విటువి అప్లికేషన్స్ అనే అంశంపై సెషన్ ఇచ్చి వాటి గురించి విపులంగా వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు మాట్లాడుతూ నూతన సాంకేతిక అంశాలపై పట్టు సాధించడానికి ఉపయోగపడే ఇలాంటి వర్క్ షాప్‌ల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు తాము నేర్చుకున్న వాటిని విద్యార్థులకు అందించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్ రావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు, రీసెర్చ్ డీన్ డాక్టర్ విఎస్.నరేష్, కార్యశాల కో-ఆర్డినేటర్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ కుసుమ కుమారి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, సహాయ కో-ఆర్డినేటర్లు టివిఎస్ఎల్.అశ్విని, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకు శిక్షణ

పెనుమంట్ర: ఆచార్య ఎన్‌జి.రంగా పరిధిలోని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో గోదావరి మండలంలోని ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన ఎంపిక చేసిన మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామ వ్యవసాయ సహాయకులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఫారం సహాయ సంచాలకులు టి.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ఎ.సిద్ధికి, జాయింట్ డైరెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి జడ్. వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వరి పంటలో పురుగులు, తెగుళ్ళు మరియు ఎలుకల కారణంగా సుమారుగా 30 శాతం దాకా గిగుబడి నష్టం జరిగుతోందని, ఈ నష్టాన్ని తగ్గించుకోవడానికి నూతన సాకేతిక పరిజ్ఞానం రైతులు అవలంబించేలా వారిని సమయాత్తం చేయాలని వ్యవసాయ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు మనోజ్ పురి గోస్వామి, డిప్యూటీ డైరెక్టర్ కె.వీరయ్య చౌదరి, ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు

మొగల్తూరు: మొగల్తూరు ముద్దుబిడ్డ, యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు వేడుకలను ముందుగా సోమవారం మొగల్తూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయం వీధిలోని టి ఆర్ కె కారు బజార్ నందు రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్, పాలకొల్లుకు చెందిన ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు అభిమానులు రక్తదానం చేశారు.